# అగ్గిపుల్ల

మా మూలుగా చూస్తే పుల్లలా వుండే అప్పారావు తలపై బొగ్గు తట్టున్నప్పుడు అగ్గిపుల్లలా కనిపిస్తాడు.

అగ్గిపుల్లకీ, సిగరెట్టుకీ ఎంత సంబంధముందో అప్పారావుకీ, మా ఊర్లో వెలిగే లైట్లకీ అంతే సంబంధముంది.

అయినా లైటు వెలిగితే మెడలోని వెంకటేశ్వరుడి బిళ్ళని కళ్ళకద్దుకునేవాళ్ళెవరికీ అప్పారావు గురించి తెలీదు. టేబిల్ లైట్ వెలుగులో నన్ను ప్రేమించని నా ప్రియురాలిపై అర్ధరాత్రివరకూ కవితలు రాసుకుంటున్న నాకూ మా 'పవర్ హౌస్'లో అడుగెట్టేవంతవరకూ అప్పారావు గురించి తెలీలేదు.


మా ఊరి పవర్ హౌసంటే - దేశంలో అతి పెద్ద జాతీయ కార్ఖానాకీ, దాని చుట్టూ ఏర్పడ్డ నగరానికీ కావలసిన విద్యుత్తును స్వంతంగా తయారుచేసే 'థర్మల్ స్టేషన్'. నేగన్ల కొద్దీ బొగ్గుని మింగి తీగెల్లోంచి వెలుగులు చిమ్మే జంక్షన్.

బొగ్గు భగ్గుమంటేనే కానీ నీరు ఆవిరి కాదు. నీరావిరైతేనే కానీ చక్రం తిరగదు, చక్రం తిరిగితేనేకానీ విద్యుత్తు వెలుగు చిమ్మదు. వెలుగుకి ఇంత 'డార్క్' ఫ్లాష్‌బాక్ వుంది. ఆ డార్క్ ఫ్లాష్‌బాక్‌లో ఒక డార్క్ పాత్ర అప్పారావు. టన్నుల కొలదీ బొగ్గుని తట్టలకెత్తి, నెత్తిపై మోసుకెళ్ళి బాయిలర్లలో నింపే లేబర్లలో అప్పారావు ఒకడు. చీకటి రాశుల్లాంటి బొగ్గు మేటల మధ్య కోల్ బిన్‌కీ, బాయిలర్‌కీ కండెలా తిరిగే అప్పారావుని చూస్తే కష్టజీవులు కండలు తిరిగుంటారనే సినిమా భ్రమ వెలుగు సోకిన చీకటిలా కరిగిపోతుంది. సోడా సీసాలాంటి అప్పారావు మెడపై అరవై కేజీల బరువు తట్ట — వేలాడే హారా బిజ్జీ కంటే ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

నెత్తికెక్కడానికి ఎటెన్‌షన్‌లో వున్న నిండుచూలాల్లాంటి అరవై కేజీల తట్ట ముందు మొట్టమొదటసారి నిల్చున్న అల్పజీవి అప్పారావు — ఎద్దుబండి తోలుకున్నోడి చేతికి విమానం ఇచ్చేసినట్టు బెంబేలుపడిపోయాడు. ఇదెత్తుకోడం సాధ్యమేనా అనుకున్నాడు. ఇది సాధ్యంకాకపోతే తన బతుకు బండి సాగడం అసాధ్యం అని కూడా అనుకున్నాడు. అతనికి తెలుసు, శ్రీకృష్ణుడు గోవర్ధనగిరి ఎత్తకపోతే గోకులానికెంత అనర్థం జరిగిపోయేదో... బొగ్గు తట్టెత్తుకోకపోతే తన కుటుంబానికి అంతే అనర్థం జరిగిపోతుందని. ఆ బొగ్గుతట్ట ముందునిల్చున్న అప్పారావుకి బోలెడు గతముంది.

అప్పారావు తండ్రి అతని తండ్రి ముట్టజెప్పిన పొలం, కట్టబెట్టిన పెళ్ళాంతో వ్యవసాయం ప్రారంభించి పదేళ్ళలో ఎకరానికి మరో ఎకరంతోపాటు కుటుంబానికి ముగ్గురు ఆడ, ఒక మగ సంతానాన్ని కూడా జోడించగలిగేడు. ఆడపిల్లలు ఎరువేసిన పిచ్చిమొక్కల్లా గుండెలవరకూ ఎదిగొచ్చిన్నాటికి నీరు లేని వరి మొక్కలా వంగిపోయాడు అప్పారావు తండ్రి.

అప్పారావు తల్లి పుష్కరాల స్నానం చేసొచ్చిన ఏడాది, గంగమ్మతల్లి పరవశించిపోయి ఆ ఊర్ని పలుకరించిపోవడంతో పంట ఏట్లోకే, పొలం



మోహన్

'పవర్ హౌస్'లో పవర్‌లో వున్నవాళ్ళు పనిచేయకపోయినాసరే వాళ్ళ 'హౌస్'లో పగలే వెన్నెల! వాళ్ళకు యీ జగమే ఊయెల! బొగ్గు బతుకుల రేకుల షెడ్డు గూళ్ళలో గూడు కట్టిన చీకటి గోడు. అక్కడ పవర్‌ని 'కట్' చేసేవాళ్ళూ లేరు, ఇక్కడ 'పవర్ కట్'ని ఆపేవాళ్ళూ లేరు!




తాకట్లోకి వెళ్ళిపోయేయి. ఎకరం పొలం అమ్మితేగానీ వున్న ఎకరం తాకట్లోంచి బైటపడలేదు. అయితే అది కూడా ఎంతోకాలం బైట వుండలేదు. గుండెల మీద మండుతున్న మూడు కుంపట్లలో ఒకదాని బరువైనా దించుకుందామనే కోరికతో అప్పారావు తండ్రి మళ్ళీపొలం తాకట్టు పెట్టి మైకుల సిమ్మాద్రికి కట్టబెట్టాడు పెద్ద కుంపట్నే.

ఉత్తప్పుడు కాయగూరలమ్ముతూ సీజన్లో సినిమా పాటలకి శ్రీదేవి స్టెప్పులేసే బుల్లెమ్మ బుట్టలో పడిపోయేదు నవరాత్రి సంబరాలలో రికార్డులేయ డానికి వెళ్ళిన సింహాద్రి. బుల్లెమ్మక్కడ స్టేజి మీద స్టెప్పు లేస్తుంటే ఇక్కడ తెరచాటున రికార్డులేస్తున్న సిమ్మాద్రి గుండెల మీద ముద్రలు పడ్డాయి. స్టెప్పుల బుల్లెమ్మతో మైకు సెట్టు సమేతంగా సిమ్మాద్రి ఉడాయించడంతో- ఏడాది తిరగకుండానే పెద్ద కుంపటి ఆర్నెల్ల కడుపుతో పుట్టింటికి తిరిగొచ్చింది.

నడిపి కుంపటి అప్పటి బాగా రాజుకొని, తమలపాకులా నవనవలాడుతున్న యవ్వనాన్ని, కోర్కెల నిప్పులేసి, చిలకచుట్టి అరచేతిలో పెట్టుకుని అందుకునే వాడికోసం ఆత్రంగా ఎదురుచూస్తోంది.

అప్పుడే విచ్చుకుంటున్న చిన్న కుంపటి, చిన్నక్క వదిలేసిన రవికల్లో ఇమడలేకపోతూ పెద్దక్క వదిలేసిన సినిమా బొమ్మల పుస్తకంలో విహరిస్తోంది.

ఇప్పుడు అప్పారావు తండ్రి కూడా రాత్రి పొద్దుపోయేవరకూ నులక మంచంలో పక్కలుమారుస్తూ తల బద్దలుకొట్టుకోవడం లేదు. శివాలయంలో గంజాయి దమ్ము లాగిస్తున్న భక్తిపారవశ్యంతో కీర్తనలు పాడుకుంటున్నాడు.

అప్పారావు తల్లి నుదుటన తెలకపిండి ఒడియమంత బొట్టు దిద్దుకొని, చిల్లులుపడిన సత్తుపంచె చుట్టబెట్టుకొని పెరట్లో 'తులసమ్మతల్లి' చుట్టూ ప్రదక్షిణలు చేసింది. 'తల్లి మాలచ్చినే' ఎప్పటికైనా తనని ఒడ్డు చేరుస్తాదని ఆమె నమ్మకం.

అప్పారావు మామూలు మీసాల మాత్ర యవ్వనంలోకి అడుగుపెట్టేనాటికి ఇదీ అతని ఇంటి పరిస్థితి. పట్నం వెళ్ళి సినిమాలు చూసి సంపాదించుకున్న జ్ఞానంతో ఆలోచించి అప్పారావుకి - ఇంకోడి పొలం దున్నడం కంటే పట్నంపోయి చిన్నదో, చితకదో 'నౌకరీ' సంపాదించుకోడం మేలనిపించింది. సరిగ్గా అలాంటప్పుడే, పండుగకొచ్చిన పెద్ద రైతు అల్లుడు పరమశివంతో పరిచయం అయింది.

పరమశివం ఖరగ్‌పూర్‌లో రైలు పెట్టెల కార్‌ఖానాలో ఉద్యోగి. మావ గారింటి మంచి అప్పనంగా వచ్చిన ఆవు నెయ్యి, జీడిపప్పు ఇచ్చి ఆఫీసర్లతో సంపాదించుకొన్న చనువుతో, తనకు తెలిసినవార్ని 'కాజువల్ లేబర్లు'గా, కళాసీలుగా ఉద్యోగాలేయిస్తుంటాడు. పార్టీల దగ్గర పుచ్చుకొన్న లంచాల్ని ఆఫీసర్లకి ఏ విధమైన రిస్కు లేకుండా వాళ్ళ ఎకౌంట్‌లలో జమ కడుతున్నం దుకు అతనికి కమిషన్ కూడా వుంటుంది.

అప్పారావు పోరు పడలేక అతని తండ్రి పరమశివంతో ప్రైవేట్‌గా మాట్లాడి, తనకాలో వున్న పొలాన్ని అమ్మేసి వడ్డీకి పోగా మిగిలిన మొత్తాన్ని అప్పారావు చేతుల్ని పరమశివం చేతుల్లో పెట్టాడు.

ఆర్నెల్లు తిరక్కుండానే అప్పారావు ఖరగ్‌పూర్‌లో టెంపరరీ కళాసీగా చేరిపోవడంతో అతని కుటుంబం మొత్తం గొడ్డూ గొంపా అమ్ముకుని వున్న పల్లె నొదిలేసి ఖరగ్‌పూర్ చేరుకున్నారు. రైల్వే క్రాసింగ్‌కి అవతల లేబర్ల షెడ్ల పక్కన మట్టిగోడలపై రేకు కప్పుతో ఓ కొంపేసుకున్నారు. అప్పారావు తల్లి మళ్ళీ కొత్త తులసిమొక్క నాటుకుంది.

దసరాకి గొట్టం ఫేంటుతో సొంత ఊరికెళ్ళిన అప్పారావుని చూసి ఎంతైనా 'అదృష్టమంతుడు' అనుకున్నారు ఊరివాళ్ళు. కాఫీకొట్టు ఊరిగాడు పరమ శివానికి కమిషనిచ్చి అతనిచే అప్పారావుని, తన కూతుర్ని మనువాడ్డానికి ఒప్పించాడు. పరమశివం అప్పారావుకి కూడా కట్నంతోపాటు సైకిలూ, వాచీ ఇప్పించాడు. పవర్ హౌస్‌లో బొగ్గులు మోసే ఖలాసీగా పర్మెనెంట్ అయ్యే నాటికి తండ్రి కూడా అయ్యాడు అప్పారావు.

నెత్తికెక్కి కూర్చున్న ఇన్ని బాధ్యతల బరువు తెలీకుండా వుండాలంటే తట్ట బరువు మోయడం తప్పనిసరి. అటువంటి గత్యంతరం లేని పరిస్థితిలోంచే తట్టెత్తుకోడానికి కావలసిన సత్తువొచ్చింది. కండల్లోంచి కాదు. మొదట్లో

11-5-90 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

అతనికా పని చాలా కష్టమనిపించేది. ట్రిప్పుకి ముప్పై, నలభై తట్టల లెక్క ఏడెనిమిది ట్రిప్పులు బాయిలర్ లోడ్ చేసేక, ఇంటికెళ్ళడానికి కాళ్ళూ, చేతులు భుజాన వేసుకుపోవలసివచ్చేది. కాలిపడిన బొగ్గును బయటకు లాగే డ్యూటీ పడిన రోజు శరీరం కాల్చిన కబాబ్ పుల్లలా మాడిపోయేది. నైట్ డ్యూటీలో ప్రపంచమంతా ప్రశాంతంగా నిద్రపోతున్న తరుణం, నెత్తిపై తట్ట కంటే కంటి రెప్పపై నిద్రే బరువుగా తోచేది అలసిన శరీరానికి. క్రమంగా కాయం కష్టానికి అలవడ్డంతో తట్ట తేలికయింది. మనసుకి కావలసిన ధైర్యం కలిగించాడు 'గాలి కవి'. గాలికవి అసలు పేరు రాజులు. బాయిలర్లకు గాలి సరఫరా చూడ్డం అతని వృత్తి. అతనూ ఒకప్పుడు బొగ్గుల ఖలాసీగా పనిచేసినవాడే. అప్పుడతను కవిత్వం రాసేవాడు. కవిత్వానికి ప్రయోజనం వుండితీరాలని నమ్మేవాడు. తన జీవితంలోని కష్టాన్నంతా కుమ్మరించి రాసిన 'చీకట్లో కాలిపోతున్న వెలుగు' కవితని 'పురుడు' అన్న పత్రిక అతని ఫోటోతో సహా అచ్చేసింది. అది చూసిన తెలుగు ఆఫీసరు భార్య ఆంధ్ర మహిళా సంఘం వార్షికోత్సవానికి మహిళల నాటకం రాసిపెట్టమంది. నాటకంలో ఒక గొప్ప విప్లవకారిణి పాత్ర పెట్టి, అది ఆమె గురించే ప్రత్యేకంగా రూపొందించానని ఒప్పించి ఆమెతో వేయించాడు రాజులు. నాటకం వేసొచ్చిన రాత్రి రాజుల్ని ప్రమోట్ చేయమని ఆర్డరు వేసింది ఆఫీసర్ భార్య. "యూనియన్ ఒప్పుకోదేమో..." అంటూ నసిగాడు ఆఫీసరు. అది నేను చూసుకుంటానంది. చూసుకుంది. రాజులు ఎయిర్‌వాల్ ఆపరేట రయ్యాడు. దాంతో సాహిత్య ప్రయోజనం సిద్ధాంతాన్ని మరింత దృఢంగా నమ్మసాగేడు. వృత్తిలో బరువు తగ్గి గాలాడ్డంతో కవిత్వపు హోరు పెరిగింది. 'గాలి కవి'గా నలుగురి నోట్లో నానిపోయేడు.

తన బతుకిలా భారమైపోయిందని బాధపడే అప్పారావుని చూసి 'గాలి కవి' అతనికి గీతోపదేశం చేశాడు. "చూడప్పారావూ! చికెన్ పులావు తిన్నోడి డొక్క

చూసి చింతపడేకంటే, చద్దన్నానికి కూడా నోచుకోనోడి డొక్క చూసి తృప్తి చెందాల... ఈ బొగ్గులు చూడు - భూమిలోంచి తవ్వి తీస్తారీట్నే. భూమిలోకి దూరి బొగ్గు తవ్వడంతోనే బుగ్గయిపోతాది ఆల్ల బతుకు - ఆల్లకి నీలాగ పక్కా నౌకిరీ లేదు, రిటైర్‌మెంట్ లేదు, పింఛను లేదు ... ఇరుకు సందుల్లోకి దూరి తవ్వడానికి తమ పిల్లల్ని కూడా పన్లోపెడ్తారు. ఆల్లకంటే నువ్వెంతో తక్‌దీర్ గలోడివి" గాలి కవి బోధనతో గుల్లలోకి నత్త ఇమిడిపోయినట్టుగా 'కొయిలా ఖలాసీ' జీవితంలోకి అప్పారావు ఎడ్జెస్ట్ అయిపోయాడు.

* * *

ఆ వేళ అప్పారావు రోజూకంటే ఉత్సాహంగా వున్నాడు. మూడ్రోడ్డుల జంక్షన్‌లో పెద్ద బత్తీలా వెలిగిపోతోంది అతని మొహం. 'జోడీదారు' తట్టనింపి తలకెత్తడమే తడవు సర్రున దూసుకుపోయి ఇంకో తట్ట నింపకుండానే తిరిగొచ్చేస్తున్నాడు. అదే చివరి లోడు. ఈ సారి బాయిలర్ నింపేస్తే డ్యూటీ ముగిసిపోతుంది. ఆ తరువాత ఇంటికే. అయితే ఈరోజు అతను తిరిగి వెళ్ళేదిరోజూ వెళ్ళే క్రాసింగ్ అవతలున్న ఇంటికి కాదు ... ఖలాసీలకు కంపెనీ ఎలాట్ చేసిన కొత్త ఇంటికి.

ఆ కార్‌ఖానాలో ఖలాసీలు వేలకొలదీ వున్నా వారి కొరకు కేటాయించబడిన క్వార్టర్ల సంఖ్య మాత్రం వందల్లోనే వుంది. కంపెనీ పనికంటే కంపెనీ అధికార్ల స్వంత పనే ఎక్కువ శ్రద్ధతో చేసి, వారి మెప్పులు పొందేవారికీ, హౌసింగ్ శాఖ ఉద్యోగులకు ముడుపులు చెల్లించేవారికీ మాత్రమే అవి లభిస్తుంటాయి. క్వార్టర్ల ఎలాట్‌మెంట్ విషయంలో అవినీతిని అరికట్టాలని, పచ్చ జెండా యూనియనూ, ఎర్ర జెండా యూనియన్ ఉమ్మడిగా ఉద్యమించడంతో ప్రభుత్వం రెండు యూనియన్లనీ కాక్‌టెయిల్ చేసి వర్కర్లని రిప్రెజెంట్ చేసే క్వార్టర్ కమిటీని ఏర్పరిచింది. అప్పటి నుంచి ఆశ్రితజన పక్షపాతం రెండింతలుగా, ముడుపులు మొత్తం మూడింతలుగా అభివృద్ధి చెందింది.

క్రాసింగ్‌కవతల రేకు కప్పుకింద తలదాచుకుంటున్న అప్పారావు ఎలాగైనా కంపెనీ క్వార్టర్ సంపాదించాలని పట్టుపట్టి 'పరమశివం'తో కలిశాడు. పరమశివం అప్పారావుని క్వార్టర్ కమిటీ మెంబరొకరికి చూపించి 'మనవాడే' అని సర్టిఫికెట్ ఇచ్చాడు. అతను "సరే చూద్దాం వస్తూండు" అన్నాడు. ఆ తరువాత అతని యూనియన్ చేసే ప్రతీ 'డెమాన్‌స్ట్రేషన్'లో జెండా పట్టుకుని, అర్థంకాకపోయినా, నోరు తిరక్కపోయినా వాళ్ళు చెప్పే స్లోగన్స్ ఇస్తూ తిరిగాడు. అతను అడిగిన చందాలన్నీ ఇస్తూ తిరిగి రసీదులడగలేదు. ఓ రోజు అతని ఇంటికి బరువైన జేబుతో వెళ్ళి తన ఇరుకింటి ఇక్కట్ల గురించి మొరపెట్టుకున్నాడు. ఇంకో రోజు అటూ వెడుతున్న మెంబర్ని పిలిచి ఇంటికి తీసుకెళ్ళి టీ, టిఫెన్లు పెట్టి "ఇలాంటి ఇంటిలో పెళ్ళికావలసిన ఆడపిల్లలతో ఎంత కష్టమో చూడండి సార్" అన్నాడు. మెంబరు ఇంటికంటే అప్పారావు అక్కచెల్లెళ్ళనే ఎక్కువ పరీక్షగా చూశాడు.

చివరికి అప్పారావు చేతికి క్వార్టర్ అలాట్‌మెంట్ పేపరందింది. బంపర్ లాటరీ ప్రైజందుకున్నవాడిలా అతన్ని అభినందించారు జోడీదారులు, లోన అసూయపడుతూనే.

ఇంటందరూ రిక్షాలలో వెళ్ళి ఇల్లు చూస్తున్నారు. పెద్ద గదితోపాటు ముందున్న చిన్న గది, వెనక్కో చిన్న కిచెన్‌లాంటిది కూడా వున్నాయి. అన్నిటికంటే అప్పారావుని ఆనందపరిచిన విషయమా ఇంటికి కరెంటుండడం. కంపెనీ మెయిన్ గదికే 'బత్తీ' ఇచ్చినందుకు అతనేమంత చింతించలేదు. లాలా మేస్త్రీని పిలిచి అందరిలాగే ముందు గదికీ, వెనక గదికీ స్వంతంగా లైన్ తీసుకోవచ్చు అనుకున్నాడు. అప్పారావు భార్య "ముందు గదిలో మన మంచం వేసుకుందాం" అని భర్త చెవిలో చెప్పింది. పెరటివైపు దడి కట్టుకొని

సాహిత్యం కేవలం మనోరంజనానికే పరిమితంగా వున్నంత వరకు, జోల పాటలు పాడి నిద్రపుచ్చడానికి ప్రయత్నించినంత వరకు కన్నీళ్ళు ప్రవహింపచేసి హృదయాన్ని తేలికపరచగలిగినంత వరకు క్రియాశక్తి అవసరం వుండదు. అది ఒక ఉన్మాదం లాంటిది. అయితే దాని ఫలితం మరొకరు అనుభవిస్తారు. కాని మనము సాహిత్యం కేవలం మనోరంజనానికి, విలాసానికి అనుకోవడం లేదు. మన గీటురాయి మీద సాహిత్యానికి మెరుగు పెట్టాలి. దానిలో ఉన్నత భావాలు, స్వతంత్ర ఆలోచనలు, సౌందర్యారాధన, ఆత్మవికాసము, జీవితపు యదార్థ ఘటనలు నిండి వుంటాయి. అవే మనలో ఉత్తేజాన్ని, సంఘర్షణలను, ఆదర్శాలను సృష్టించుతాయి. అవి ఎప్పుడూ మనలను నిద్రింప చేయడానికి ప్రయత్నించకూడదు. అసలు ఎక్కువగా నిద్రించడము మృత్యువుతో సమానము కదా!

— ప్రేమ్‌చంద్

సేకరణ: తవుటు నాగభూషణం

తులసికోటేసుకోవచ్చని ప్లానేసుకొంది అప్పారావు తల్లి. పెద్ద గది కిటికీ విప్పితే మెయిన్ రోడ్డుపై వచ్చీపోయేవారు చక్కగా కన్పిస్తున్నారు. అక్కడ తన కుట్టుమిషను పెట్టుకోవాలని నిర్ణయించుకొంది చిన్నక్క. అప్పారావు తండ్రి స్వయంగా దగ్గరుండి సున్నం కొట్టించేడు. రిక్షాలు కట్టించి సామాన్లు చేరవేశాడు. ఆ రోజు మంచిదని అంతా కొత్త ఇంట్లోకి చేరిపోయి పాలు పొంగించారు. అప్పారావుని డ్యూటీ ముగిసేక కొత్తింటికే వచ్చేమని చెప్పారు.

అందుకే అప్పారావు ఆ వేళ అంత ఉత్సాహంగా వున్నాడు. ఆఖరి తట్ట విసురుగా తిరగేసి తలకు కట్టిన గావంచా విప్పి ఒళ్ళు దులుపుకున్నాడు. అప్పటికే నైట్ షిఫ్ట్ ఖళాసీలు వచ్చి బొగ్గు మేటలపై కూర్చొని బీడీ దమ్ములు కొడుతున్నారు. అప్పారావు ఈల వేస్తూ కాళ్ళూ, చేతులు కడుక్కునేందుకు కొళాయి దగ్గరకెళ్ళి దాన్ని తిప్పాడు. గరగరమని ఒకింత చప్పుడుచేసి నాలుగు కన్నీటి బొట్లు రాల్చింది కొళాయి. "ఛ! దీవాలి" అని ఓ తిట్టుతో ఆ కార్యక్రమాన్ని ఉపసంహరించుకొని సైకిలెక్కి ఇంటిదారి పట్టేడు ఈల వేసుకుంటూ.

ఇల్లు చేరుకున్న అప్పారావు ఈలపాట ఆగిపోయింది. ద్వారం నుండీ, కిటికీల నుండీ వెలుగు చేతులు చాపి ఆహ్వానిస్తుందనుకున్న ఇల్లు - చీకట్లో మునిగిపోయింది. సైకిల్ స్టాండేసి ఇంట్లో అడుగుపెట్టాడు అప్పారావు. లోన చీకటి. భార్య ఏడుస్తున్న కొడుకుపై విసుక్కుంటోంది. "లైటేటయిందే" అంటూ తడుముకుంటూ వెళ్ళి స్విచ్చిని టక్‌టక్ లాడించేడు. "లైటూ లేదూ... వల్లకాడూ లేదు సందేల నుంచీ ఎలగే లేదు..." విసుగు నిండిన భార్య జవాబు వినిపించింది.

అప్పారావు అయోమయంగా పైకొచ్చాడు. రిటైర్ అయినాక కంపెనీ నుంచీ, కోడలొచ్చాక ఇంటి నుంచీ గెంటబడి అరుగు మీదే కాలక్షేపం చేస్తున్న పక్కింటి ముసలాడ్ని విషయం కనుక్కున్నాడు.

ముసిలోడు దగ్గొచ్చినంతగా నవ్వేడు... "ఒరే బేటా... కలబడి బత్తీలేయించుకోగానే కాదు, అయ్యెలగడానికి కరెంటుండాలి కరెంటు ... అదేటి మన కంపెనీ కాడ సాలినంత వుందేటి - లేదు... ముందు కంపెనీ పనిక్కావాల, కంపెనీ సాబ్‌లు, బడాబాబులు దర్జాగా బతకడానికి ఆలిల్లల్లో బోల్డు బోల్డు కావాల కరెంటు ... ఒక్క సిటం కూడా బందవడానికి ఈలు లేదు ... ఆపైన మిగిలితే మన లేబర్ కాలనీకి, లేకపోతే పవర్ కట్. కరెంట్ కరువంతా మన కాలనీయే బరించాలి" సణగడానికి విషయం దొరికిన ముసిలోడు మరి ఆగడం లేదు.

అప్పారావు నీరసంగా ఇంట్లోకి తిరిగొచ్చాడు. అంతవరకూ పాత సామాన్ల బుట్టలో పడేసిన లాంతరు కోసం వెతుకుతున్న అప్పారావు పెళ్ళాం ... అది చేతికి తగలడంతో "ఇదిగో ఇదెలిగించు" అని కేకేసింది. ఇక అవసరం పడదని పడేయడంతో చిమినీ పగిలిపోయింది. అప్పారావు లాంతరు ఆడించి చూసి కాస్త నూనె వుందని నిర్ధారించుకున్నాడు. ఒత్తి సరిచేసి అగ్గిపుల్ల గీశాడు. భగ్గున మండింది అగ్గిపుల్ల. లాంతరు ముట్టించి అగ్గిపుల్ల విసిరేశాడు. ఒక్క క్షణం వెలిగి కన్ను మూసింది. అంతే... అగ్గిపుల్లలు వెలిగిస్తాయి, వెలగవు. ●

## పాకెట్ స్టోరీ

హుస్నాబాదు నుంచి నచ్చుమారుకి రైల్‌కార్ ప్రయాణం గంట! ఆ రోజు శలవు. రైలు రద్దీగా లేదు. ఎంత కొత్తవాళ్ళనైనా టకాటకా పలకరించి ఆ గంటా కాలక్షేపం చెయ్యడం బాగా అలవాటు అతనికి. దేనికైనా ముక్తసరిగా సమాధానం చెప్పడం అలవాటు ఆ పెద్దాయనకి.

"ఎక్కడిదాకా సర్?" అతను!

"నచ్చుమారు" ఆయన!

"నేనూ అక్కడికే!"

ఆయన మాట్లాడలేదు.

అతను సిగరెట్ వెలిగించి ఆయనకొకటి ఆఫర్ చేశాడు.

"నో"

"ఏం సార్! అలవాటు లేదా?"

"ఇదివరలో ఒకసారి తాగాను. నచ్చలేదు"

"పోనీ ఒక్కపొడి వేసుకుంటారా?"

"సారీ!"

"ఏం సార్? అదీ అలవాటు లేదా?"

"ఇదివరలో ఒకసారి వేసుకున్నాను. నచ్చలేదు"

"ఐసీ! కాస్సేపు కాలక్షేపానికి పేకాడదామా సార్? నా దగ్గర పేక వుంది. డబ్బులేం వద్దు. ఊరికే సరదాగా ఆడదాం"

"సారీ!"

"అదేమిటి సార్! అదీ అలవాటు లేదా!"

"ఇదివరలో ఒకసారి ఆడాను. నచ్చలేదు"

"పోనీ చెస్ ఆడతారా?"

"అదీ లోగడ ఒకసారి ఆడాను. నచ్చలేదు"

"చంపారు సర్! పోనీ టెన్నిస్ క్రికెట్‌లాటి ఔట్‌డోర్ గేమ్స్ అయినా ఏవైనా ఆడతారా?"

"లోగడ ఒకసారి ఆడాను. నచ్చలేదు. కాని మా అబ్బాయి టెన్నిస్ బాగా ఆడతాడు"

"మీకు అబ్బాయి ఒక్కడే అనుకుంటాను."

"కరెక్ట్! మీకెలా తెలుసు?" ఆయన ఆశ్చర్యపోయాడు.

"ఏముందీ సింపుల్! మీకేదీ రెండోసారి నచ్చదు గదా!"

— వి.పా.శా.

ఆంగ్లం నుండి కథలు ఎక్కువగా వచ్చాయి తెలుగులోకి. ఆంగ్లం ద్వారా మిగతా పాశ్చాత్య భాషల్లోని కథలు కూడా వస్తున్నాయి. కాని "రెండో తరహా" పాశ్చాత్య కథకుల ప్రభావం తెలుగు రచయితల మీద ఎక్కువగా వుంటోంది. గాలి పోగుచేసి గారడీ చేసే రచయితల్ని చూసి మనం ముగ్ధులమైపోయి వారిని అనుకరించవలసిన అవసరం లేదు. జీవితం గురించి స్పష్టమైన, నిశ్చితమైన అభిప్రాయాలు కలిగినట్టివారు, అద్భుత విధానాలలో కథానికా రచన చేసినవారు, విశ్వ సాహిత్యంలో చిరస్థాయిగా నిలవగలిగినవారు పాశ్చాత్య రచయితలు ఎందరో వున్నారు. వారి ప్రభావం తెలుగు రచయితలపై లేదు. వారు జీవితాన్ని తరచి చూచినట్టుగా వారి రచనల వల్ల తెలుస్తుంది. జీవితం గురించి మనలో చాలామంది కథలు చదివి మాత్రమే తెలుసుకుంటున్నట్టుగా వుంది.

—రావి శాస్త్రి

సేకరణ :- తవుటు నాగభూషణం